వేగంగా సహాయక మరమ్మతు పనులు

- వరద నష్టంపై రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలి
- ఢిల్లీకి ఉపముఖ్యమంత్రి నేతృత్వంలో బృందం
- ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (ఎస్‌డిఆర్‌ఎఫ్) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్రం నుంచి సరైన సహాయం అందకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. గతంలో కేంద్రం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం... గతేడాదికి సంబంధించి రావల్సిన నిధులు.. ప్రస్తుతం వ్యవసాయ, పశు సంవర్ధక, నీటిపారుదల, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్య, విద్యుత్ శాఖల పరిధిలో వాటిల్లిన నష్టంపై సమగ్ర నివేదికలు రూపొందించాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ రెండు నివేదికలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని బందం ఈ నెల నాలుగో తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి అందజేస్తుందని తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టాలపై సిఎం రేవంత్ సచివాలయంలో సోమవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు.

వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడిందని అధికారులు సిఎం దష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్‌ఆర్‌ఆర్, ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవని సిఎం గుర్తు చేశారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నివేదికపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

తమ ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని సిఎం అన్నారు. నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు ఆయన ఆదేశించారు. పురపాలక, పంచాయతీరాజ్, జిహెచ్ఎంసి పరిధిలో వీధి దీపాల నిర్వహణ, ఏర్పాటుపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు రేవంత్ సూచించారు. చెంగిచర్లతో పాటు జియాగుడ, అంబర్ పేటలోని స్లాటర్ హౌస్‌ల్లో హలాల్, జట్కా సక్రమంగా జరిగేలా చూడాలని.. అధునాతన యంత్రాలు వాడేలా చూడాలని.. అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని, మాంసం విక్రేతలు అన్ని నిబంధనలు పాటించేలా చూడాలని సిఎం ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు సమగ్ర నివేదికలు రూపొందించి రెండు రోజుల్లో అందజేయాలని సిఎం ఆదేశించారు.

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నూతన వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, ఆసుపత్రుల భవనాల పనులు వేగవంతం చేయడంతో పాటు వాటి ప్రారంభానికి తేదీలు నిర్ణయించాలని ఆ శాఖ కార్యదర్శి క్రిసియానా జోంగ్తూని సూచించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో సీఎం మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక పనులు వేగవంతం చేయాలని, పరిహారాలు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.

అన్ని శాఖలు ఎస్‌డిఆర్‌ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు సకాలంలో వినియోగితా పత్రాలు (యుసి) సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపత్తు సమయాల్లో స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన ఎస్‌డిఆర్‌ఎఫ్ దళాలు వరదల సమయంలో మెరుగైన సేవలు అందించడంపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. భారీ వర్షాల సమయంలో 42 ఆపరేషన్లలో పాల్గొని 217 మందిని ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సిబ్బందికి మరింత మెరుగైన శిక్షణ, నైపుణ్యాలు అందేలా చూడాలని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు స్పందన, పౌర సహాయక విభాగం డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డికి రేవంత్ సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగానికి కావల్సిన అధికారులు, సిబ్బందిని వెంటనే సర్దుబాటు చేయాలని సిఎస్‌కు సిఎం సూచించారు.

మారుతున్న వాతావరణ పరిస్థితులతో ముందు అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు అప్రమత్తంగా ఉండడంతో పాటు విపత్తుల సమయంలో తక్షణమే క్షేత్ర స్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో పనులకు కంటింజెంట్ కింద కలెక్టర్లకు రూ.పది కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన జిల్లా కలెక్టర్లకు రూ.ఐదు కోట్ల చొప్పున నిదులు విడుదల చేస్తామని సిఎం తెలిపారు. సమీక్షలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకాటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

త్వరలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ విభాగాల అనుసంధానం

- నక్షాలు లేని 408 గ్రామాల్లో రీసర్వే
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు మెరుగైన పారదర్శక సేవలు అందించడానికి వీలుగా రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను త్వరలో అనుసంధానం చేయనున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సంబంధిత శాఖలతో పాటు ఎన్ఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్‌ను జతచేయాలని భూభారతి చట్టంలో పేర్కొన్నామని, దానికనుగుణంగా సాఫ్ట్ వేర్‌ను అభివృద్ధి పరుస్తున్నామని చెప్పారు. పోర్టల్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా నిర్వహణ మరింత సులభతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఐసి అధికారులకు సూచించారు. కొత్తగా అభివృద్ధి చేసే సాఫ్ట్‌వేర్‌లో కోర్టు కేసుల మానిటరింగ్ సిస్టమ్ ఉండేలా చూడాలన్నారు. రాష్ట్రంలో నక్షా లేని ఐదు గ్రామాల్లో రీసర్వే కొలిక్కివచ్చిన నేపథ్యంలో మిగిలిన 408 గ్రామాల్లో మరి కొద్ది రోజుల్లోనే రీసర్వేను ప్రారంభించబోతున్నామని తెలిపారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో భూవివాదాల పరిష్కారానికి ఈ సర్వే మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ. రాజీవ్ గాంధీ హనుమంతు, సిసిఎల్ఎ కార్యదర్శి మంధా మకరంద్. ఎన్ఐసి ఎస్ఐఒ ప్రసాద్, విజయ్‌మోహన్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ Vవ, అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టు, ఏలూరు జిల్లా, ఏలూరు

ఎం.వి.ఓ.పి.నెం.219/2025

బిట్వీన్ :
అనుపోజు పార్వతి ...పిటీషనర్స్
మరియు
కొండకమర్ల అబ్దుల్ వాహెబ్ & Others ...రెస్పాండెంట్స్

టు:
2వ రెస్పాండెంట్ : కొండకమర్ల బవాజన్, S/o.అబ్దుల్ బాషా, పురుషుడు, వయుస్సు తెలియదు, కారు బేరింగ్ నెంబర్. AP 28 DR 4603 కారు యజమాని, R/o.H.No.F#A-302, ఫ్లాట్ నెం. 8&90, సాయి రామ్ ప్లాజా, హనుమాన్ నగర్, మణికొండ, హైదరాబాద్-500089.

అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది.18-9-2025 తేది ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బద్ది వరహాలరావు, బద్ది శిరీష
న్యాయవాదులు, విజయవాడ.
సెల్: 9440653935, 9059911539

సమీక్షా సమావేశంలో ట్రాఫిక్ పోసులతో మాట్లాడుతున్న సిపి

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం ప్రక్రియ

- హైదరాబాద్ నగర సిపి సివి ఆనంద్
- భద్రత ఏర్పాట్ల తనిఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం ప్రక్రియ జరిగేలా చూడాలని హైదరాబాద్ నగర సిపి, డిజి సివి ఆనంద్ అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాన్ని సోమవారం ఆయన స్వయంగా పరిశీలించారు. వెస్ట్‌జోన్ పరిధిలో గణేష్ నిమజ్జనం బందోబస్తును తనిఖీ చేశారు. అనంతరం సివిల్, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సిపి వారికి దిశానిర్దేశం చేశారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సాఫీగా సాగేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక శక్తులు, పిక్ పాకెటర్లతోపాటు ఈవ్ టీజర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గణేష్ విగ్రహాలను త్వరగా నిమజ్జనం చేసేవిధంగా నిర్వాహకులతో సంప్రదింపులు చేయాలన్నారు. బోరబండా, రహమాత్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సిపి పర్యటించారు. మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు ఎస్ఎం విజయ్‌కుమార్, కె అపూర్వరావు, బికె రాహుల్ హెగ్డే, అదనపు డిసిపి ఇక్బాల్ సిద్ధిఖీతోపాటు ఎసిపిలు తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులో కమిషనర్ పర్యటన

గణేష్ నిమజ్జనం నేపథ్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. నెక్లెస్ రోడ్డు మార్గంలో పీపుల్స్ ప్లాజా, సన్ రైజింగ్ పాయింట్, లేక్ వ్యూ పార్క్, బతుకమ్మ కుంట, సంజీవయ్య పార్క్, బేబీ పాండ్‌లలో నిమజ్జన ఏర్పాట్లను అదనపు కమిషనర్ రఘు ప్రసాద్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. బారికేడింగ్, లైటింగ్, క్రేన్‌ల ఏర్పాటు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించారు. సకాలంలో గణేష్ ప్రతిమలను నిమజ్జనానికి తరలించాల్సిందిగా నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. గణేష్ ప్రతిమల ఊరేగింపు జరిగే మార్గాల్లో నిర్దేశించిన గార్బేజి పాయింట్లలోనే చెత్తను వేయాలని ప్రజలకు కమిషనర్ సూచించారు.

నాటి రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

- దేశంలో పెరుగుతున్న సామాజిక సమానతలు
- కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తున్న బిజెపి : జాన్‌వెస్లీ
- నెల్లుట్లలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం

వారోత్సవాలను ప్రారంభిస్తున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపడుతూ ముందుకు సాగుదామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. జనగామ జిల్లా లింగాలఘన్‌పూర్ మండలం నెల్లుట్ల గ్రామంలో సోమవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జాన్‌వెస్లీ ప్రారంభించారు. అంతకుముందు రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటికీ స్ఫూర్తి అని అన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది ఉద్యమకారులు, ప్రజలు తాము అనుకున్న లక్ష్యం కోసం ప్రాణం అర్పించారని తెలిపారు. అమరులను స్మరిస్తూ ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం నాడు కమ్యూనిస్టు పార్టీ ప్రజలను ఐక్యం చేసిందని గుర్తు చేశారు. అన్నింటికీ ఓర్చుకొని ప్రజలు పోరాడి అజేయులుగా నిలిచారని చెప్పారు. ఆ ఉద్యమ ఫలితంగా భూసంస్కరణలు అమలయ్యాయని తెలిపారు. ఇది కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమేనన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటం నిర్వహించి 79 సంవత్సరాలు అవుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ ఆధ్వర్యంలో ఈ పోరాట విషయాలను స్మరిస్తూనే భవిష్యత్‌లో ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

కేంద్రంలో బిజెపి మత ఘర్షణలు రెచ్చగొడుతూ పాశవిక కాషాయ పాలన సాగిస్తోందన్నారు. కార్మికులతో పాటు ప్రజలకు కనీస హక్కులు లేకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నదన్నారు. దేశంలో రోజురోజుకూ సామాజిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు కమ్యూనిస్టుల నాయకత్వంలో జరుగుతున్న ఉద్యమాల్లో ప్రజలు సంఘటితమై కలిసిరావాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగి లాంటి అనేకమంది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నేలకొరిగినట్టు గుర్తు చేశారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముగింపు సభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి పాల్గొననున్నట్టు తెలిపారు. అంతకుముందు జనగామ పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద జాన్‌వెస్లీ ఎర్రజెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇర్రి అహల్య, బోట్ల శేఖర్, రాపర్తి రాజు, సింగారపు రమేష్, నాయకులు జోగు ప్రకాష్, బూడిద గోపి, బోడ నరేందర్ యాకయ్య, చుంచు విజయేందర్, చందు నాయక్, మహేందర్, నాగరాజు, బొడ్డు కరుణాకర్, దేవదానం, పందిళ్ళ కళ్యాణి, దాస గాని సుమా, శంకరయ్య వెంకటేష్ ఉప్పలయ్య నాగరాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఒ.యస్.నెం.147/2024

బిట్వీన్:
పాపూరి నాగేంద్రమ్మ వగైరా...(పిటీషనర్లు)వాదులు
మరియు
కొమ్మాలపాటి రాజేశ్వరి వగైరాలు ...(రెస్పాండెంట్లు)ప్రతివాదులు

టు,
2వ ప్రతివాది (R-2) : కొమ్మాలపాటి గౌతమ్, తండ్రి. లేటు రామకృష్ణ, మైనరు అయినందున గార్డియన్ తల్లి 3వ ప్రతివాది కొమ్మాలపాటి(సవిలి) సబిత, నివాసం ఫ్లాటు నెం.202, డోర్ నెం.7-1621/237, హెచ్.నెం. 135/2TR, సాయి నివాస్ అపార్ట్‌మెంటు, యస్.ఆర్.నగర్, హైదరాబాద్ -38, తెలంగాణ స్టేట్.

పై నెంబరు దావా నెం.147/2024 2వ ప్రతివాది మరియు సదరు దావా లోని ఐ.ఎ.నెం.1213/2024 ఇన్ఒ.యస్.నెం.147/2024 పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు/నోటీసులు పంపించినను మీకు ముట్టనందున మీకు సమన్లు/ నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.24-10-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:24-10-2025

యెల్లేపెద్ది ఫణికుమార్,
పిటీషనర్లు/వాదులు తరపు అడ్వకేట్,
2/5 బ్రాడీపేట, గుంటూరు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, రాజమహేంద్రవరం

E.A.No.41/2024, E.P.No.114/2019 in O.S.No.384/2009

Between:-
1. Urrenkala Srinivas @ Vurrinkala Srinivasu (died)
2. Vurrinkala Nagalakshmi
3. Vurrinkala (Yekula) Devi Surya Kumari
4. Vurrinkala Uday Sai Kiran
Proposed LRs of Deceased 1st DHR. **...Petitoners/DHRs**
And
Madduri Sesha Bhaskara Mrutyunjaya Rao, and Others
...Respondents/JDRS

2. Madduri Venkata Bhaskara Satyanarayana, S/o. Narasimha Rao, Hindu, Aged 55years, Employee, R/o. Oriental Bank of Commerce,Uppal, 214, Buddha Nagar, Opp R.T.C. Bus Depot, Warangal High Way, Hyderabad.
3. Ketharaju Sribhaskara Kanaka Valli, W/o.Ravichandra, Hindu, Aged about 57years, Housewife, R/o. Oriental Bank of Commerce, Uppal, 214, Buddha Nagar, Opp.R.T.C. Bus Depot, Warangal High Way, Hyderabad.
4. Yajnamurthy Padmavathi, W/o. Chandra Sekhar, Hindu, Aged 47Years, HouseWife, Oriental Bank of Commerce, Uppal, 214, Buddha Nagar, Opp. R.T.C. Bus Depot, Warangal High Way, Hyderabad.
2,3,4,.. Respondents/JDRS

పై నంబరు గ్రంథంలో 2,3,4 రెస్పాండెంటు/జెడిఆర్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.15-09-2025 సం॥రం** తేదీ ఉదయం **10.30ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేనియెడల సదరు గ్రంథ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
దోకల శ్రీనివాసరావు
రాజమండ్రి అడ్వకేట్,రాజమండ్రి
01-09-2025 సెల్.9948029577

పొలాలను వదలని వరద

- పత్తి రైతుకు తీవ్ర నష్టం
- పాలమూరు జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో పత్తి పంట నష్టం
- చౌడు నల్ల భూముల్లో అధిక నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షం తగ్గినా పంట చేలలో నీరు తగ్గలేదు. చెరువులు నదుల పరివాహక ప్రాంతాల్లో వేసిన పత్తి చేలు ఇంకా వరదలోనే ఉన్నాయి. జూన్ మొదటి వారంలో వేసిన పంటలు పూత కాత దశలో ఉన్న సమయంలో ఇటీవల ఆగస్టు నెలలో కురిసిన వర్షాలు పత్తి పంటకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఇసుక మేటలతో పంటలు దెబ్బతిన్నాయి. 13 జిల్లాల పరిదిలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో వరి, పత్తి, వేరుశనగ వంటి పంటల నష్టం వాటిల్లింది. ఇందులో పత్తికి తీవ్రంగానే వానదెబ్బ కొట్టిందని అధికారులు, రైతు సంఘాల నాయకులు తెలిపారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో సాగుచేసిన పత్తి.. విత్తులకు సరిపడా కూడా దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా చౌడు నల్ల భూముల్లో సాగు చేసిన పత్తి పైర్లు నేల చూపు చూస్తున్నాయి. పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు. నెల రోజులుగా కురిసిన వర్షాలకు పత్తి, కంది, వేరుశనగ భూముల్లో వరద చేరింది. నాగర్‌కర్నూల్, గద్వాల, మహబూబ్‌నగర్ పరిధిలో పత్తి పంట అత్యధికంగా సాగవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. గద్వాల జిల్లాలోని సీడ్ పత్తితోపాటు దూది పత్తి లక్షన్నర ఎకరాలు సాగు అవుతోంది. నాగర్ కర్నూల్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలు, మహబూబ్‌నగర్లో లక్ష ఎకరాలు, నారాయణపేట జిల్లాలో లక్ష ఎకరాలు, వనపర్తి జిల్లాలో 1,25,000 ఎకరాలు సాగు చేశారు.

వరదలో మునిగిన పత్తి

పూత పూసి.. కాత వచ్చే దశలో అధిక వర్షాలకు పత్తి చేను అంతా ఎర్రబారింది. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని తెలకపల్లి, బిజినపల్లి, తాడూరు, లింగాల, ఉప్పునుంతల మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. గద్వాల, అలంపూర్, ధరూర్, మల్దకల్, ఇటిక్యాల మండలాల పరిధిలో ఉన్న నల్ల మట్టిలో సాగుచేసిన పత్తి అంతా అధిక నీటితో ఎర్రబారిపోయింది.

పెరిగిన పెట్టుబడులు

ఈ ఏడాది గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడులు పెరిగాయి. విత్తనం ఒక్కో ప్యాకెట్‌కు 100 రూపాయలకు పైగానే అధిక ధర పెట్టి రైతులు తీసుకున్నారు. మొదట్లో వర్షాల్లేక విత్తనం మొలకెత్తలేదు. దాంతో రెండు మూడు సార్లు విత్తనం వేయాల్సి వచ్చింది. ఇప్పుడు అధిక వర్షాలు పైరును దెబ్బతీశాయి. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వినియోగించారు. ఎకరాకు రూ.35 వేలకు పైగానే ఖర్చు చేశారు. ఆ స్థాయిలో దిగుబడి వస్తుందా? లేదా? అని రైతుల్లో ఆందోళన నెలకొంది.

అప్పులు పెరిగాయి

బాలయ్య, రామగిరి, కల్వకుర్తి మండలం

రెండెకరాల భూమిలో పత్తి సాగు చేశాను. అధిక వర్షాలకు పూర్తిగా నీరు చిచ్చు పెట్టింది. పూత రాలిపోయింది. తిరిగి కాస్తుందన్న నమ్మకం పోయింది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆర్ శ్రీనివాసులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో వరదకు గురైన పంటలను పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలి. రైతులు అప్పులపాలు కాకుండా ప్రభుత్వం పరిహారం చెల్లించాలి.

ప్రకృతి రక్షణే-ప్రజల రక్షణ

- బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు విమలక్క
- 'బహుజన బతుకమ్మ' పోస్టర్ ఆవిష్కరణ

బహుజన బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విమలక్క తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ప్రకృతి రక్షణే-ప్రజల రక్షణ' నినాదంతో బహుజన బతుకమ్మ-2025 సెప్టెంబర్ 20న ఉస్మానియాలో ప్రారంభమై అక్టోబర్ మూడవ తేదీన నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో ముగుస్తుందని నిర్వహణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు విమలక్క తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ అమరుల స్మృతి కేంద్రం గన్‌పార్క్ వద్ద సోమవారం 'బహుజన బతుకమ్మ' వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమ పతాకగా అంది వచ్చిన బహుజన బతుకమ్మ 2010లో ప్రారంభమై 15 ఏళ్లుగా కొనసాగుతూ.. ప్రజా సమస్యలు లేవనెత్తుతున్నదని చెప్పారు. దాదాపు 12 కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమంతోపాటు ప్రజలు, ప్రజాసంఘాలు ఈ అవగాహనతో ముందుకు వచ్చి బహుజన బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి, అడవులు, స్త్రీ రక్షణ, శాంతి స్వావలంబన, వ్యవసాయాన్ని చాటుతూ 'బహుజన బతుకమ్మ' జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మి, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఎనిశెట్టి శంకర్, ఆచార్య కట్టా భగవంత్‌రెడ్డి, టిపిటిఎఫ్ నాయకులు ప్రకాష్‌రావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, ఎఐఎఫ్‌టియు అధ్యక్షులు మల్లేశం, నాయకులు యాకయ్య, అరుణోదయ ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, కార్యదర్శి రాకేష్, పిడిఎస్ యు (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరు విజయ్, నాయకులు దిలీప్, పిఒడబ్ల్యు (స్త్రీ-విముక్తి) గంగారత్నం, సౌజన్య, సంతోషి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

- సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్‌గా నిలిపేందుకు తమ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ప్రజాభవన్‌లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల వారు తెలంగాణకు వచ్చే పరిస్థితిని కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 46 వేల చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి రూ.122 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తామనీ, ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తున్నదని చెప్పారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారితో సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయించి, ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమకూర్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో మహిళల చేత పెద్ద ఎత్తున వ్యాపారం చేయించే ఆలోచనలో ప్రభుత్వముందని తెలిపారు. ఐదేండ్లలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని వివరించారు. ప్రతి ఏడాది రూ. 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించి మొదటి ఏడాదిలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ రూ.21,600 కోట్లను పంపిణీ చేసినట్టు తెలిపారు.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.A.606/2024, E.A.376/2022, E.P.72/2019, O.S.14/2007

Between:-
గంధం సత్తిరాజు (డైడ్)
గంధం వెంకయ్య నాయుడు **...పిటిషనర్లు**
మరియు
ముత్తా వెంకట రత్నం (డైడ్)
ముత్తా అమ్మాజి వగైరాలు **...రెస్పాండెంట్లు**

టు.
1. ముత్తా అమ్మాజి భర్త.వెంకటరత్నం, ఫ్లాట్ నెం.41, రాగన్నగూడ బొంగ్లూర్ ఇబ్రహింపట్నం రంగారెడ్డి జిల్లా తెలంగాణ.
2. ముత్తా మురళి తండ్రి.వెంకటరత్నం, ఫ్లాట్ నెం.41, రాగన్నగూడ బొంగ్లూర్ ఇబ్రహింపట్నం రంగారెడ్డి జిల్లా తెలంగాణ.
3. మంచం ఈశ్వరి, భర్త. వీరవెంకటసత్యన్నారాయణ, ఫ్లాట్‌నెం.415, సాయిబాబా గుడివద్ద, కొంపల్లి గ్రామం, కొంపల్లి మండలం, రంగారెడ్డి తెలంగాణా.

పై నెంబరు E.P.72/2019 లో చనిపోయిన DHr యొక్క వారసులుగా ఇందలి పిటిషనరును చేర్చుకుని E.A.376/2022 దాఖలు చేయబడిన సదరు E.A.376/2022 పెండింగ్‌గా యుండగా JDR అయిన ముత్తా వెంకటరత్నం గారు చనిపోగా మీ వగయిరాలను అనగా మిమ్ములను మరియు తోటదేవి అను ఆమెను వారసునిగా add చేయించమని పై గ్రంధములో E.A.606/2024 దాఖలు చేయబడినది. సదరు E.A.606/2024 విషయమై మీకు గల ఆక్షేపణలను **ది.10-09-2025** తేది ఉదయం **10.30ని॥లకు** పై కోర్టులో హాజరయి తెల్పుకోవలెను. లేనియెడల పై గ్రందములో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
రాజమండ్రి **బి.సూర్యనారాయణ**
30.08.2025 DHr తరపు అడ్వకేట్

విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- నలందా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ యాజమాన్యానికి హెచ్చార్సీ ఆదేశం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

2021–2025 విద్యా సంవత్సరంలో బి.ఫార్మసీ పూర్తి చేసిన 16 మంది విద్యార్థులకు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ట్రాన్సఫర్ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని నల్లగొండ జిల్లా చర్లపల్లి–హైదరాబాద్ రోడ్డులోని నలందా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ యాజమాన్యాన్ని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. కమిషన్ ముందు ఈ నెల 8న విచారణకు హాజరు కావాలని ఆ కాలేజ్ చైర్మెన్ లేదా డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ కు సమన్లు జారీ చేసింది. సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిరాకరించడంపై ఆ కమిషన్ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ షమీం అఖ్తర్ అధ్యక్షతన విచారించింది. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిరాకరించడం రాజ్యాంగబద్ధమైన మౌలిక హక్కుల ఉల్లంఘనగా, ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హక్కుల ఉల్లంఘనగా కమిషన్ పేర్కొంది.

పామాయిల్ గెలలు మెట్రిక్ టన్ను రూ.19107

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఆగస్టు నెలకు పామాయిల్ గెలలు మెట్రిక్ టన్ను ధరను రూ.19,107గా ఆయిల్ ఫెడ్ అధికారులు సోమవారం ఖరారు చేశారు. జులై నెల టన్ను గెలలు రూ.18052 ఉండగా. ఆగస్టు లో టన్నుకి రూ.1055 పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో టన్ను రూ.20 వేలు పైగానే పలుకగా.. మే, జూన్, జులై నెలల్లో ధరలు తగ్గుముఖం పట్టాయి. ఆగస్టులో టన్నుకు రూ.1055 పెరగడం విశేషం.

ఆశాల చలో హైదరాబాద్ విజయవంతం

- సమస్యల పరిష్కారానికి యూనియన్ ప్రతినిధులకు కమిషనర్ హామీ
- ఫిక్స్‌డ్ వేతనం, ఇన్సూరెన్స్‌పై ప్రభుత్వానికి నివేదిక
- క్షేత్రస్థాయిలో సమస్యలపై గైడ్‌లైన్స్

ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న జయలక్ష్మి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఆశాల చలో హైదరాబాద్ విజయవంతమైంది. తెలంగాణ ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ కోఠిలోని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున ఆశాలు పోలీసుల ఆంక్షలను, ఆటంకాలను అధిగమించి హైదరాబాద్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులతో కమిషనర్ చర్చించి సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు ఆశావర్కర్లతో కలిసి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి కోఠి ఆంధ్ర బ్యాంక్ చౌరస్తా నుంచి ర్యాలీగా డిఎంహెచ్‌ఎస్ వరకు వచ్చారు. కోఠి ఉమెన్స్ కాలేజీ చౌరస్తా ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల పారితోషికాలు తగ్గించాలనే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు, ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

కమిషనర్‌తో చర్చలు

ఆశావర్కర్ల ధర్నా సందర్భంగా పోలీసులు జోక్యం చేసుకొని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణతో మాట్లాడి చర్చలకు పిలిచారు. యూనియన్ రాష్ట్ర నాయకత్వం 20 మందిని, రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మిని చర్చలకు ఆహ్వానించారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలనే విషయాన్ని, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల మట్టి ఖర్చులు, ప్రమోషన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ప్రభుత్వానికి నివేదించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని కమిషనర్ హామీనిచ్చారు. ప్రతినెలా పారితోషికాలు తగ్గించకుండా మొత్తం అమౌంట్‌ను 1వ తేదీ లోపు అకౌంట్‌లో వేస్తామని కమిషనర్ చెప్పారు. పెండింగ్‌లో ఏమేమున్నాయో బడ్జెట్ చూసుకొని ఎన్‌హెచ్‌ఎం ద్వారా అవి వెంటనే విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక నోట్ ఇస్తే చర్చించి గైడ్‌లైన్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పారితోషికాలను చెల్లిస్తామని తెలిపారు. ఈ చర్చలకు యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధని, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, యూనియన్ రాష్ట్ర కోశాధికారి గంగమణితోపాటు జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, సిఐటియు జిల్లాల నాయకులు కూడా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్, హైదరాబాద్ సౌత్ అధ్యక్షులు ఎం శ్రావణ్ కుమార్, నాగేశ్వర్, సాయిబాబు, నిక్సన్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాకుండా సోమవారం ఉదయమే ఆశాలు, సిఐటియు నాయకులను జిల్లాల్లో ముందస్తు అరెస్టులు చేశారు. అనంతరం విడిచిపెట్టారు.

నిరసన తెలుపుతున్న మల్లేష్ తదితరులు

భూనిర్వాసితులకు రెట్టింపు పరిహారం చెల్లించాలి

- సిపిఎం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- కలెక్టరేట్ ఎదుట పిప్పల్‌కోటి రిజర్వాయర్ రైతుల ధర్నా

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూనిర్వాసిత రైతులకు నష్టపరిహారం రెట్టింపు చేసి, వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. భూనిర్వాసిత రైతులతో కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. ఏడేళ్ల కిందట ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇప్పటి వరకు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఆ రోజు నిర్ణయించిన ధర ఎకరాకు ఎనిమిది లక్షలు అన్నారని, ప్రస్తుతం భూమి విలువ రెట్టింపు అయినందున నష్టపరిహారం రెట్టింపు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లోనే రైతుల నష్టపరిహారానికి సంబంధించిన బడ్జెట్ విడుదల చేయాలన్నారు. బోథ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల శంకర్ అసెంబ్లీలో రైతుల నష్టపరిహారం గురించి ప్రస్తావించాలని, తద్వారా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతు నసిరుద్దీన్ మాట్లాడుతూ.. భూములు దున్నుకోలేక అమ్ముకోలేక అవస్థలు పడుతున్నామన్నారు. పిల్లల పెండ్లిళ్లు చేయాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అనేక మంది రైతులు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. రిజర్వాయర్ భూములను సందర్శించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి.. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, గ్రామ కార్యదర్శి ధోనిపెల్లి స్వామి, నాయకులు లింగాల చిన్నన్న, గంగాసాగర్, గ్రామ రైతులు ఎస్‌కె నసిరుద్దీన్, ఆయిటి అశోక్, పెంటన్న, మామిడి నారాయణ, మొట్ట గంగయ్య పాల్గొన్నారు.

కాళేశ్వరం పాపం హరీశ్ రావుదే..

- కెసిఆర్ నీళ్ల కోసం ఆలోచన చేస్తే.. వారు ఆస్తులు పెంచుకునే ఆలోచన చేశారు
- ఎసిబికి దొరికిన ఇంజనీర్ల వెనక ఎవరున్నారో తేల్చాలి
- ఎటుపడితే అటు మాట్లాడతామంటే ఖబడ్దార్ ...తోలుతీస్తాం బిడ్డా..! : కవిత

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఇరిగేషన్ మాజీ మంత్రి హరీశ్ రావు, రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావు, మెగా కృష్ణారెడ్డిల వల్లే మాజీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సిబిఐ విచారణ ఎదుర్కోవాల్సి వచ్చిందని కెసిఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ బీడు భూములకు నీళ్ల కోసం కెసిఆర్ ఆలోచన చేస్తే..బడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఆస్తులు పెంచుకునేందుకు హరీశ్,సంతోష్ ఆలోచన చేశారని ఆమె ఆరోపించారు. అమెరికా పర్యటన ముగించుకుని సోమవారం హైదరాబాద్ వచ్చిన ఆమె..బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

" కెసిఆర్ పక్కన ఉన్నవారు ఆయన పేరు చెప్పుకొని లబ్ది పొందారు. వారు చేసిన చెత్తపనుల వల్ల కెసిఆర్ పేరు బద్నాం అయింది. అయినా వాళ్లనే మోస్తాం అనుకుంటే పార్టీ ముందుకు ఎలా పోతది..? కెసిఆర్ బిడ్డగా చాలా బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్ రావుదే కాళేశ్వరం అవినీతిలో మేజర్ పాత్ర. అందుకే రెండోసారి హరీశ్ రావుకి ఇరిగేషన్ శాఖ ఇవ్వలేదు. గతంలో కూడా హరీశ్,సంతోష్ రావులు నాపై ఎన్నో కుట్రలు చేశారు. భరించినా. మీడియాలో వ్యక్తిగతంగా విమర్శించినా వారి పేర్లు చెప్పలేదు. బిఆర్ఎస్ తమ్ముళ్లకు కోపం వచ్చినా పర్లేదు. వాస్తవాలు చేదుగున్నా మాట్లాడుకోవాలి. కెసిఆర్‌పై సిబిఐ విచారణకు కారణం ఎవరు..? ఎసిబికి దొరికిన కాళేశ్వరం ఇంజనీర్ల వెనక ఎవరున్నారో ప్రభుత్వం ఎందుకు తేల్చలేదు..? హరీశ్ రావు, సంతోష్ రావుల వెనక సిఎం రేవంత్ రెడ్డి ఉన్నడు. వాళ్లను ఆయనే కాపాడుతున్నడు. కెసిఆర్‌నే సిఎం రేవంత్ టార్గెట్ చేసిండు. నన్ను ఎవరో ఆపరేట్ చేస్తున్నారని రేపటి నుంచి సోషల్‌మీడియాలో దుమ్మెత్తిపోస్తరు. ఖబడ్దార్ బిడ్డ...ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాను. నాది కెసిఆర్ బ్లడ్. ఇండిపెండెంట్‌గా చెప్తున్నా. రాజకీయంగా ఇబ్బందైతే నేనే భరిస్తా. కడుపు రగులుతోంది. మానాన్నకి రాసిన లేఖను లీక్‌చేసి 90 రోజులుగా నరకం చూపిస్తున్నారు. సోషల్‌మీడియాలో ఇష్టం వచ్చినట్టు రాపిస్తున్నారు. హిమాలయ పర్వతంలాంటి కెసిఆర్‌ను ఇప్పుడు సిబిఐ కేసు అంటారు. కెసిఆర్ పైనే సిబిఐ విచారణ జరిగేంత దాక వచ్చాక బిఆర్ఎస్ పార్టీ ఉంటే ఏంటి..? పోతే ఏంటి..?ఇటువంటి దుర్మార్గుల వల్లే కదా పార్టీ ఓడిపోయింది. పైసలున్నయ్. టివిలున్నయ్.. సోషల్‌మీడియా ఉంది..ఎటు పడితే అటు మాట్లాడటతామంటే. తోలుతీస్తాం బిడ్డ. గీత గీసుకుంటాం బిడ్డ..మీరు ఒక కామెంట్ పెడితే మేం పది పెడతాం. ఇక్కడదాకా వచ్చాక ఆగే ప్రసక్తే లేదు. కెసిఆర్ ప్రతిష్ట దెబ్బతీయాలనే కాంగ్రెస్ కుట్ర. దమ్ము ధైర్యం ఉంటే హరీశ్,సంతోష్ రావులపై దృష్టి పెట్టండి.." అంటూ కవిత ఉద్వేగంగా మాట్లాడారు.

నిరంకుశ పాలకులపై ధిక్కారస్వరం కాళోజీ నారాయణరావు

- సిపిఎం నాయకులు నంద్యాల నరసింహారెడ్డి

ప్రజాశక్తి కల్చరల్

నాటి నిరంకుశ పాలనకి వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపించిన కాళోజీ నారాయణరావు దేశ స్వాతంత్రం వచ్చిన తరువాత తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కు కోసం ఉద్యమించారని సిపిఎం నాయకులు మాజీ శాసన సభ్యులు నంద్యాల నరసింహా రెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా కాళోజీ నారాయణరావు యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నంద్యాల నరసింహా రెడ్డి మాట్లాడుతూ వాడుక భాషలో తెలంగాణ నుడికారంలో కవితలను అల్లిన కాళోజీ ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించి నాటి నిజాం నవాబు పాలన రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా ఎదురించి నిలిచారని చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కావాలని ఆకాంక్షించిన కాళోజీ తెలంగాణకి అన్యాయం చేసిన పరాయి వాడైతే తరిమి కొడతాం, మన వాడైతే ఇక్కడే పాతి పెడతామని చెప్పారని గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సంఘ సేవకులు ఆత్మీయ నిర్మల, స్వాతి చౌదరి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు గాంధీ గాన సభ పాలక వర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలనడం రాజ్యాంగ వ్యతిరేకం

- తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

లంబాడీలను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలనడం రాజ్యాంగ వ్యతిరేకమని తెలంగాణ గిరిజన సంఘం (టిజెఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు వాంకుడోత్ వీరన్న, మూడ్ బాలు, భూక్యా హరి, అశోక్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులుగా ఉంటూ లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలనే వైఖరి తీసుకున్న సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుల తీరుపై ఆ పార్టీ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లుగా ఎస్‌టి జాబితాలో ఉన్న లంబాడి గిరిజనులను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలని వారు ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బిజెపి పార్లమెంటు సభ్యుడిగా సోయం బాబురావు లంబాడీలను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలని గతంలో డిమాండ్ చేశారని, దీంతో గిరిజన తెగల్లో ఘర్షణ సృష్టించి లబ్ధి పొందారని గుర్తు చేశారు. బిజెపి సహకారంతో సోయం బాబురావు లంబాడీలకు వ్యతిరేకంగా ఆనాడు ఢిల్లీలో పెద్ద సభ నిర్వహించి రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని తెలిపారు.

ఒపిఎస్ హామీని సిఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలి

అభివాదం చేస్తున్న వక్తలు

- పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు
- ఆత్మగౌరవ సభలను పోరాటాల సభలుగా మార్చొద్దు
- టిజిఇ జాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఉద్యోగుల ఆత్మగౌరవ సభ"లో వక్తలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను అమలు చేయాలని పలువురు వక్తలు సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కొత్త పెన్షన్ విధానం ఉద్యోగులకు శాపంగా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణను పదేండ్లు పాలించిన గత సర్కార్ ఉద్యోగుల ఆశలపై నీళ్లు పోసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి, ఎస్‌సి రిజర్వేషన్ల అమలు లాంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న సిఎంగా... ఒపిఎస్ అమలు చేస్తే రేవంత్ చరిత్రలో నిలుస్తారని అభిప్రాయపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజీఈజాక్ ఆధ్వర్యంలో "ఉద్యోగుల ఆత్మగౌరవ సభ" నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పెన్షన్ భిక్ష కాదనీ, గౌరవంగా జీవించే హక్కులో భాగమేనని అన్నారు. కొత్త పెన్షన్ మార్కెట్ ఆటుపోట్లను బట్టి మారడం వల్ల ఉద్యోగుల జీవితాలకు భరోసా ఉండదని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ ఉద్యోగుల పెన్షన్ సమస్యను శాసనమండలిలో చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఉద్యోగుల సిపిఎస్‌కు సంబంధించి గవర్నర్‌తో పాటు సీఎస్‌కు గతంలో వినతులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో ఉద్యోగులు చేసే ఒపిఎస్ సాధన పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తానని ప్రకటించారు. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి లచ్చిరెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు ఇదే చివరి విద్రోహదినం సెప్టెంబర్ ఒకటి కావాలని ఆకాంక్షించారు. సిపిఎస్ విధానంలో లోపాలున్నాయి కాబట్టే యూపీఎస్ వచ్చిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల సమస్యను మానవీయ కోణంలో పరిష్కరిస్తోందనే నమ్మకం ఉందన్నారు. రెవెన్యూ శాఖకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చినట్టుగానే సిపిఎస్ ఉద్యోగులకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు కె రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పాదించిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని (యుపిఎస్) రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నేటికి పాత పెన్షన్ విధానమే కొనసాగుతోందని గుర్తు చేశారు. తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎల్. దర్శన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెఎసి నాయకులు నాగవల్లి ఉపేందర్, ఎస్.రాములు, రాధ, ఎం. శ్రీనివాస్, శంకర్, కె హన్మంత్ రావు, దేవేందర్, జి కృపాకర్, కె రాములు, బాణాల రాంరెడ్డి, పాక రమేష్, డాక్టర్ జి నిర్మల, అశ్వథామారెడ్డి, కత్తి జనార్ధన్, హబీబ్ మస్తాన్, గరికె ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ప్రయివేట్ ట్రావెల్ బస్సు

- అక్కడికక్కడే నలుగురు మృతి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్లితే.. హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు ప్రయాణికులతో పోతున్న సివిఆర్ ప్రయివేట్ ట్రావెల్ బస్సు అడ్డాకుల సమీపంలో రాత్రి రెండు గంటల సమయంలో ముందు వెళు న్న లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సు క్లీనర్ హసన్ (35), రాయలసీమ నంద్యాలకు చెందిన అస్రాఫ్ ఉన్నిసా (70), ప్రొద్దుటూరు కమలాపురానికి చెందిన ఎల్లమ్మ (40), మరో మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జడ్చర్ల రూరల్ సిఐ కమలాకర్‌రావు, అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాస్, భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వాహనాలను తొలగించి.. గాయపడిన వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తండ్రి వాహనం కింద పడి బాలుడు మృతి

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో విషాద ఘటన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

అప్పటి వరకు తల్లిదండ్రుల కళ్లేదుటే ఆడుకుంటున్న పసి బాలుడు.. బంతి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు తండ్రి నడిపే ఆటో ట్రాలీ చక్రాల కింద పడి ప్రాణం కోల్పోయాడు. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన కల్లెం నరేష్ భార్యాపిల్లలతో కలిసి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామం వెళ్లే రోడ్డు సమీపంలో ఉంటూ ఆటో ట్రాలీ నడుపుతున్నాడు. సోమవారం ఉదయం లష్కర్‌గూడ రోడ్డులో ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా నరేష్ ఆటో ట్రాలీని రివర్స్ తీస్తుండగా.. బంతితో ఆడుకుంటున్న అతని 13 నెలల కుమారుడు కల్లెం రోహిత్ అకస్మాత్తుగా వాహనం కిందకు వచ్చి టైర్ల కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే గిలగిల్లా కొట్టుకుని మృతిచెందాడు. అకస్మాత్తు పరిణామానికి షాక్‌కు గురైన నరేష్ తేరుకునేసరికే కొడుకు విగతజీవిగా మారాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాలుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మా పైసలపై కేంద్రం పెత్తనమేంది?

- సిపిఎస్ రద్దయ్యేదాకా పోరాటం
- ఇక ఢిల్లీలో ఉద్యమిస్తాం
- సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- పిఆర్‌టియుటిఎస్ మహాధర్నాలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

'మా పైసలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనమేందీ?. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్మును తిరిగి చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌లోకి మారితే ఉద్యోగులు దాచుకున్న సొమ్మును చెల్లించకపోవడం సరైంది కాదు. ఇక ఢిల్లీలో ఉద్యమిస్తాం'అని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పిఆర్‌టియుటిఎస్ ఆధ్వర్యంలో సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది ఉపాధ్యాయులు నల్ల దుస్తులు ధరించి భారీగా తరలొచ్చారు. పెన్షన్ విద్రోహ దినం పేరుతో ఇందిరాపార్క్ వద్ద జరిగిన మహాధర్నానుద్దేశించి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సిపిఎస్‌ను రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, మ్యానిఫెస్టోలోనూ పొందుపర్చిందని గుర్తు చేశారు. కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేశాయన్నారు. రాష్ట్రంలో సిపిఎస్ అమల్లో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల భాగస్వామ్యం ఉందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఇచ్చిన హామీని సిఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో రేవంత్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. ఒకవేళ రద్దు చేయకుంటే సిపిఎస్‌ను రద్దు చేసే ప్రభుతాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధికారంలోకి తెచ్చుకుంటారని అన్నారు. భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సిపిఎస్ రద్దయ్యేదాకా పోరాటం చేస్తామని చెప్పారు. ఏఐఎఫ్‌టీవో సెక్రెటరీ జనరల్ సిఎల్ రోజ్ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసిన రాష్ట్రాలపై కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఉద్యోగి వాటా, ఆ రాష్ట్రవాటా తిరిగి చెలించబోమంటూ చెప్పడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో సిపిఎస్‌ను రద్దు చేయాలనీ, సొమ్మును రాబట్టుకునేందుకే కేంద్రంపై పోరాటం చేస్తామని చెప్పారు.

పిల్లల కిడ్నాప్ ముఠా అరెస్ట్

- ఆరుగురు చిన్నారులకు విముక్తి
- నిందితుల నుంచి రూ.5 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మాదాపూర్ డిసిపి వినీత్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పిల్లలను కిడ్నాప్ చేస్తున్న ముఠాను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి ఆరుగురు పిల్లలకు విముక్తి కల్పించారు. నిందితుల నుంచి రూ.ఐదు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి జిల్లా మాదాపూర్ డిసిపి కార్యాలయంలో డిసిపి వినీత్ మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు, సిద్ధిపేటకు చెందిన చెలుకూరి రాజు, మహ్మద్ ఆసిఫ్, రిజ్వానా, నరసింహారెడ్డి, బాలరాజు ఒక ముఠాగా ఏర్పడ్డారు. రాజు నాలుగేండ్ల కిందట కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఆడ శిశువును కిడ్నాప్ చేసి రూ.42 వేలకు విక్రయించాడు. అప్పటి నుంచి తన సహచరులతో కలిసి కిడ్నాప్‌లు కొనసాగించాడు. హైదరాబాద్, సంగారెడ్డి, లింగంపల్లి, కాచిగూడ ప్రాంతాల్లో ఐదేళ్లలోపు చిన్నారులను రాజు గుర్తించేవాడు. రాజు, ఆసిఫ్, రిజ్వానా కలిసి కిడ్నాప్ చేసేవారు. అనంతరం ఆ పిల్లలను పెద్దమొత్తంలో డబ్బులకు అమ్మేవారు. ఆగస్టు 26వ తేదీన లింగంపల్లిలో అఖిల్‌ను కిడ్నాప్ చేశారు. ఆ బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ముఠాపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో సోమవారం ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వారి నుంచి అఖిల్ (5), అమ్ములు (8నెలలు), లాస్య (5), అరుణ్ (2), ఆద్విక్ (2), ప్రియ (1)ను రక్షించారు. పిల్లల తల్లిదండ్రులను ఇంకా గుర్తించలేదు. వారిని జిల్లా బాల సంరక్షణ అధికారికి అప్పగించారు. నిందితులను విచారించగా.. పటాన్‌చెరువుకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను స్వయంగా అమ్మినట్టు వెల్లడైంది. ఈ ముఠా సభ్యులకు ఇతర వ్యక్తులతో ఏదైనా సంబంధం ఉందా అనే విషయంలో దర్యాప్తు జరుపుతున్నట్టు డిసిపి తెలిపారు. ఈ కేసును ఛేదించిన మియాపూర్ ఎసిపి, చందానగర్ సిఐ విజయ్, డిఐ భాస్కర్‌నాయక్‌ను డిసిపి అభినందించారు.

యాక్సిస్ బ్యాంక్ 'స్పర్శ్ వీక్ 2025' ప్రారంభం

హైదరాబాద్ : ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ తమ ఖాతాదారులకు సేవలను మరింత మెరుగుపర్చడానికి 'స్పర్శ్ వీక్ 2025'ను ప్రారంభించినట్లు సోమవారం తెలిపింది. సెప్టెంబర్ 1–5 వరకు జరిగే ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 5,868 శాఖలలో ఒక్క లక్షకు పైగా ఉద్యోగులు కస్టమర్లతో సంప్రదింపులు జరుపుతారని పేర్కొంది. 40 నగరాల్లో తమ సీనియర్ అధికారులు ఖాతాదారులతో సమావేశమై సేవల నాణ్యతను మెరుగుపర్చడానికి కృషి చేస్తారని ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ అమితాబ్ చౌదరి తెలిపారు.